GV MALL®
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్పాట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 118 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 +https:www.prajarepublic.com + వెల - 1/-
మంగళవారం 03 డిసెంబర్ 2024

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# ఏపీ మంత్రివర్గ భేటీ ప్రారంభం

## ..కీలక పాలసీలకు ఆమోదం లభించే అవకాశం

ఏపీ మంత్రి వర్గ సమావేశం ప్రారంభమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరుగుతున్న ఈ భేటీలో.. వివిధ పాలసీలకు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది..

అమరావతి , డిసెంబర్ 03, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ మంత్రి వర్గ సమావేశం ప్రారంభమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరుగుతున్న ఈ భేటీలో.. వివిధ కీలక అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. ఐటీ, టెక్స్టైల్ పాలసీలకు ఆమోదం లభించనుంది. మారిటైమ్, పర్యాటకం, స్పోర్ట్స్ పాలసీల సవరణలను ఆమోదించే అవకాశం ఉంది. ప్రధాని ఆవాస్ యోజన పథకం కింద పెండింగ్ గృహాల నిర్మాణం పూర్తిపై నిర్ణయం తీసుకోనున్నారు. డిసెంబర్ 15న పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం అంశంపైనా కీలక చర్చ జరగనుంది.




# స్వర్ణ దేవాలయంలో శిక్ష అనుభవించిన సుఖ్ బీర్ సింగ్..!

అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయంలో పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి సుఖ్బీర్ సింగ్ సేవాదర్ శిక్షను అనుభవించారు.



డిసెంబర్ 03, (రిపబ్లిక్ న్యూస్): పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, శిరోమణి అకాలీదళ్ పార్టీ నేత సుఖబీర్ సింగ్ బాదల్కు అకాల్ తఖ్ పలు శిక్షలు విధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయన అమృత్సర్లోని స్వర్ణదేవాలయంలో సేవాదార్(కాపలాదారుడు) గా శిక్షను అనుభవించారు.మంగళవారం ఉదయం వీల్చైర్లో స్వర్ణ దేవాలయానికి వచ్చిన ఆయన ప్రవేశద్వారం వద్ద మెడలో పలకను ధరించి, చేతిలో ఈటెను పట్టుకొని సేవాదర్ శిక్షను అనుభవించారు. మరోవైపు పార్టీ సీనియర్ నాయకులు బిక్రమ్ సింగ్ మజీతి-యా సైతం శిక్షను అనుభవించారు. ఆయన స్వర్ణ దేవాలయంలో పాత్రలను శుభ్రం చేశారు.శిరోమణి అకాలీదళ్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సుఖబీర్ సింగ్ బాదల్ మతపరమైన తప్పిదాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. 2007-17 మధ్య కాలంలో పార్టీతోపాటు వారి ప్రభుత్వం రాజకీయంగా పలు తప్పుడు నిర్ణయాలు తీసుకున్నట్లు అకాల్ తఖ్ నిర్ధరించింది. ఈ విషయంలో పార్టీ చీఫ్ సుఖ్బర్ ను దోషిగా తేల్చారు. తాను చేసిన తప్పులను అంగీకరించిన సుఖ్ బీర్ బేష-రతుగా క్షమాపణలు చెప్పారు. ఈ క్రమంలోనే ఆయనకు స్వర్ణ దేవాలయంలో పాత్రలు, బూట్లు శుభ్రం చేయాలని అకల్ తఖ్ ఆదేశించింది. అంతేకాకుండా ఆయన తండ్రి పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి ప్రకాశ్ సింగ్ బాదల్ కు గతంలో ఇచ్చిన బిరుదును కూడా ఉప సంహరించుకుంటున్నట్లు తెలిపింది.

# జగన్..వాస్తవ లెక్కలు చూస్తే మీ నిర్వాకం తెలుస్తోంది :మంత్రి నాదెండ్ల

గత జగన్ పాలనలో ఈ సమయానికి సేకరించిన ధాన్యం 4.43 మెట్రిక్ టన్నులని.. బాధ్యతతో కూటమి ప్రభుత్వం సేకరించిన ధాన్యం 9.14 మెట్రిక్ టన్నులని మంత్రి నాదెండ్ల మనోహన్ అన్నారు.



అమరావతి, డిసెంబర్ 03, (రిపబ్లిక్ న్యూస్): గత జగన్ పాలనలో ఈ సమయానికి సేకరించిన ధాన్యం 4.43 మెట్రిక్ టన్నులని.. బాధ్యతతో కూటమి ప్రభుత్వం సేకరించిన ధాన్యం 9.14 మెట్రిక్ టన్నులని మంత్రి నాదెండ్ల మనోహన్ అన్నారు. వాస్తవ లెక్కలు చూస్తే జగన్ నిర్వాకం తెలుస్తోందని విమర్శించారు. సేకరించిన 24 గంటల్లో రైతు ఖాతాల్లోకి డబ్బులు వేస్తున్నామన్నారు. రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. ఈ మేరకు జిల్లాల వారీగా వివరాలను మంత్రి నాదెండ్ల 'ఎక్స్' ఖాతాలో షేర్ చేశారు.

# హరీశ్ రావుపై పంజాగుట్ట పీఎస్లో కేసు నమోదు



హైదరాబాద్, డిసెంబర్ 03, (రిపబ్లిక్ న్యూస్): మాజీ మంత్రి, భారాస నేత హరీశ్ రావు పై కేసు నమోదైంది. సిద్దిపేటకు చెందిన చక్రధర్ ఫిర్యాదుతో పంజాగుట్ట పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేశారు. హరీశ్తోపాటు అప్పటి టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధాకిషన్రావుపైనా కేసు నమోదైంది. తన ఫోన్ ట్యాపింగ్ చేశారని.. అక్రమ కేసులు పెట్టి వేధించారని చక్రధర్ ఫిర్యాదు చేశారు. 120(బి), 386, 409, 506, రెడ్విత్ 34, ఐటీ యాక్ట్ కింద హరీశ్రావుపై కేసు నమోదు చేశారు.

# ఉపాధి హామీ పథకం

## కింద ఏటా 60 లక్షల ఉద్యోగ కార్డులు..

గ్రామీణాభివృద్ధి బడ్జెట్ లో 'ఎంజీఎన్ఆర్ఈజీఎస్కి 57 శాతం కేటాయించినట్లు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.



దిల్లీ,డిసెంబర్ 03, (రిపబ్లిక్ న్యూస్): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఏటా 60లక్షల కొత్త ఉద్యోగ కార్డులు జారీ చేస్తున్నట్లు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఎంజీఎన్ఆర్ఆజీఎస్ పథకం కింద గత నాలుగేళ్లలో 10.43 కోట్ల మంది కార్మికుల పేర్లను తొలగించారని లోక్సభలో కాంగ్రెస్ సభ్యుడు కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. దీనికి పెమ్మసాని స్పందిస్తూ ఈ మేరకు వ్యాఖ్యానించారు.'ఎంజీఎన్ఆర్ఆజీఎస్ పథకం కింద గ్రామాల అభివృద్ధికి బడ్జెట్లో 57 శాతం కేటాయించాం. కార్డుల తొలగింపులు ఆధార్ సీడింగ్ అవసరానికి అనుసంధానంగా ఉన్నాయి. పారదర్శకతను పెంచేందుకే ఈ ఆధార్ సీడింగ్ ఉంది. కార్డుల తొలగింపు రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత. కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదు. ప్రతి ఏటా 60లక్షల కొత్త జాబు కార్డులను జారీ అవుతున్నాయి. వివిధ కారణాల వల్ల సగటున 30లక్షల కార్డులను తొలగించారు. దేశంలో దాదాపు 13- 14 కోట్ల జాబ్ కార్డులు ఉండగా.. అందులో 9.2 కోట్ల కార్డులు యాక్టివ్గా ఉన్నాయి' అని పెమ్మసాని పేర్కొన్నారు.

# సౌదీలో చిక్కుకున్న వారిని స్వదేశానికి రప్పిస్తాం : మంత్రి అచ్చెన్నాయుడు

సౌదీ అరేబియాలో చిక్కుకున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన యువతను స్వదేశానికి రప్పిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి, డిసెంబర్ 03, (రిపబ్లిక్ న్యూస్): సౌదీ అరేబియాలో చిక్కుకున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన యువతను స్వదేశానికి రప్పిసా-_మని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. జిల్లాలోని పలాస, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, కంచిలి, ఇచ్ఛాపురం ప్రాంతాలకు చెందిన 16 మంది యువకులు అక్కడ చిక్కుకున్నారు. ఏజెంట్ల ద్వారా మోసపోయిన యువకులను తిరిగి సొంత ప్రాంతాలకు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు. సీఎం చంద్రబాబు,కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడుతో ఈ అంశంపై చర్చించి తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో ఉత్తరాంధ్రలో పరిశ్రమల అభివృద్ధి, యువతలో నైపుణ్య శిక్షణ పెంపొందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతామన్నారు.

# హైడ్రాకు రూ.50 కోట్ల నిధులు విడుదల.. పురపాలక శాఖ ఉత్తర్వులు

హైడ్రాకు రూ.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కార్యాలయ నిర్వహణ, వాహనాల కొనుగోలుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది

హైదరాబాద్, డిసెంబర్ 03, (రిపబ్లిక్ న్యూస్): హైడ్రాకురూ.50కోట్ల నిధులు మంజూరయ్యాయి. కార్యాలయ నిర్వహణ, వాహనాల కొనుగోలుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ మేరకు నిధులు విడుదల చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

# ముగిసిన ఏపీ కేబినెట్ భేటీ.. కీలక నిర్ణయాలకు ఆమోదం

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన ఏపీ మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.

అమరావతి, డిసెంబర్ 03, (రిపబ్లిక్ న్యూస్): ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన ఏపీ మంత్రివర్గం పలు కీలకనిర్ణయాలు తీసుకుంది. పీఎం ఆవాస్ యోజన గిరిజిన గృహ పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గత ఐదేళ్లలో నిర్మించని గృహాల రద్దుపై సమావేశంలో నిర్ణయం తీసుకుంది. సమీకృత పర్యాటక పాలసీ 2024-29, 2024-29 స్పోర్ట్స్ పాలసీలో మార్పులకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.

కేబినెట్ నిర్ణయాలివే..

ఆయుర్వేద, హోమియోపతి ప్రాక్టీషనర్ రిజిస్ట్రేషన్ చట్ట సవరణకు ఆమోదం

పొట్టి శ్రీరాములు వర్ధంతి (డిసెంబరు 15)ని ఆత్మార్పణ సంస్మరణ దినంగా నిర్వహణకు ఆమోదం

ఐటీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ పాలసీ 4.0కు ఆమోదం

ఏపీ టెక్స్టైల్స్ గార్మెంట్ పాలసీకి ఆమోదం

ఏపీ మారిటైమ్ పాలసీకి కేబినెట్ ఆమోదం





ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం



# ఎమ్మిగనూరులో కార్డన్ సెర్చ్

**డీఎస్పీ ఉపేంద్రబాబు ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పోలీసులు ఎమ్మిగనూరు పట్టణంలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.**

ఎమ్మిగనూరు , డిసెంబర్ 03 , (రిపబ్లిక్ న్యూస్): జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పోలీసులు ఎమ్మిగనూరు పట్టణంలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. సబ్ డివిజన్ పోలీసులు బృందాలుగా ఏర్పడి మంగళవారం తెల్లవారుజామున ఎమ్మిగనూరు పట్టణంలోని శక్తినగర్, ఎన్టీఆర్ బిల్డింగ్స్, శాంతినగర్, శివన్ననగర్, వెంకటపురం, లక్ష్మీపేట లలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.

# శబరిమల వెళ్లే భక్తులకు రైల్వే శాఖ కీలక సూచనలు

**శబరిమల వెళ్లే భక్తులకు దక్షిణ మధ్య రైల్వే కీలక సూచనలు చేసింది. రైళ్లలో పూజా కార్యక్రమాలు నిర్వహించకూడదని, కర్పూరం వెలిగించవద్దని విజ్ఞప్తి చేసింది.**




సికింద్రాబాద్, డిసెంబర్ 03 , (రిపబ్లిక్ న్యూస్): శబరిమల వెళ్లే భక్తులకు దక్షిణ మధ్య రైల్వే కీలక సూచన చేసింది. రైళ్లలో పూజా కార్యక్రమాలు నిర్వహించకూడదని, కర్పూరం వెలిగించవద్దని విజ్ఞప్తి చేసింది. యాత్రికుల రైళ్ల కోచ్ల లోపల పూజా విధానంలో భాగంగా కర్పూరం వెలిగించడం, హారతి ఇవ్వడం, అగరబత్తులు, సాంబ్రాణి పుల్లలు వెలిగించడం వంటివి చేస్తున్నట్టు రైల్వే అధికారుల దృష్టికి వచ్చిందని తెలిపింది. ఇలాంటి కార్యక్రమాలు రైళ్లలో చేయవద్దని ప్రయాణికులకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసింది.దక్షిణ మధ్య రైల్వే యాత్రికుల సౌకర్యార్థం శబరిమలకు ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఈ రైళ్లు జోన్లోని సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ, కాకినాడ, తిరుపతి, నాందేడ్ తదితర స్టేషన్ల నుంచి బయలుదేరి మార్గమధ్యలో పలు స్టేషన్లలో ఆగుతాయి. ఆయా ప్రాంతాల నుంచి ప్రయాణించే వారు సురక్షితంగా గమ్య స్థానాలకు చేరేందుకు దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల సహకారం కోరుతుంది. రైళ్లలో, రైలు ప్రాంగణాలలో ఎలాంటి పూజా కార్యక్రమాలు నిర్వహించకూడదని విజ్ఞప్తి చేస్తుంది. రైళ్లలో, రైల్వే ప్రాంగణాల్లో మండే స్వభావంగల పదార్థాలతో ప్రయాణం చేయడం, వాటిని ఏ రూపంలోనైనా వెలిగించడం నిషేధించినట్లు రైల్వే శాఖ వెల్లడించింది.ఇలాంటి చర్యలు భద్రతకు తీవ్ర ముప్పును కలిగించి అగ్ని ప్రమాదాలకు దారితీసి మానవ ప్రాణాలకు ముప్పు కలిగించడమే కాకుండా... రైల్వే ఆస్తులకు సైతం నష్టం కలిగించే అవకాశం ఉందని రైల్వే శాఖ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇలాంటి చర్యలు రైల్వే చట్టం–1989లోని సెక్షన్లు 67, 154, 164, 165 ప్రకారంశిక్షార్హమైననేరంగా పరిగణించబడతాయని రైల్వే శాఖ స్పష్టం చేస్తోంది. ఇటువంటి చర్యల వల్ల జరిగిన నష్టానికి బాధ్యత వహించడంతోపాటు, 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించే అవకాశముందని అధికారులు తెలిపారు.

# భవనం పైనుంచి దూకి యువతి, యువకుడు ఆత్మహత్య

**విశాఖపట్నంలోని గాజువాక పరిధిలో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు.**



అక్కిరెడ్డిపాలెం, డిసెంబర్ 03 , (రిపబ్లిక్ న్యూస్):విశాఖపట్నంలోని గాజువాక పరిధిలో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. జీవీఎంసీ 69వ వార్డు వెంకటేశ్వర కాలనీలో యువతి, యువకుడు మూడంతస్తుల భవనం పైనుంచి దూకి బలవన్మరణానికి పాల్పడ్డారు. గాజువాక పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతులను అమలాపురం ప్రాంతానికి చెందిన పిల్లి దుర్గారావు (32), సాయి సుస్మిత (25)గా గుర్తించారు. దుర్గారావు రంగా క్యాటరింగ్ యజమాని కాగా.. సాయి సుస్మిత సాఫ్ట్వేర్ ఉద్యోగిని. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

# తల్లి మృతిని తట్టుకోలేక కుమార్తె ఆత్మహత్యాయత్నం

**కుటుంబ కలహాలతో తల్లి ఆత్మహత్య చేసుకుందని కుమార్తె ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన తాడిపత్రిలో చోటుచేసుకుంది.**



తాడిపత్రి , డిసెంబర్ 03 , (రిపబ్లిక్ న్యూస్): కుటుంబ కలహాలతో తల్లి ఆత్మహత్య చేసుకుందని కుమార్తె ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన తాడిపత్రిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురం తాడిపత్రి కి చెందిన శ్రీలక్ష్మి (40) తన కూతురు శ్రీజ ఇతర కులానికి చెందిన యువకున్ని ప్రేమించిందని మనస్థాపంతో తల్లి ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. తల్లి మృతిని తట్టుకోలేక కూతురు సోమవారం ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకుంది. బంధువులు చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

# తెలంగాణలో భవన, లేఅవుట్ల అనుమతులకు కొత్త ఆన్ లైన్ విధానం

**భవనాలు, లే అవుట్ల అనుమతులకు 'బిల్డ్ నౌ' పేరుతో కొత్త ఆన్లైన్ విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.**




హైదరాబాద్, డిసెంబర్ 03 , (రిపబ్లిక్ న్యూస్): భవనాలు, లే అవుట్ల అనుమతులకు 'బిల్డ్ నౌ' పేరుతో కొత్త ఆన్లైన్ విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. 'బిల్డ్ నౌ' పేరుతో ఏర్పాటు చేసిన ఈ విధానాన్ని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు మంగళవారం ప్రారంభించారు."పట్టణాభివృద్ధిలో గతంలో లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో దాదాపు 60 శాతం మంది జనాభా పట్టణ, నగర ప్రాంతాల్లో ఉంటున్నందున ఈ శాఖ ప్రాధాన్యతపై దృష్టి పెట్టి.. స్వయంగా సీఎం రేవంత్రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రంలో వ్యాపారాలకు అనువైన వాతావరణం కల్పిస్తున్నాం. గత ప్రభుత్వం తీసుకొచ్చిన అభివృద్ధి విధానాలను కొనసాగిస్తున్నాం. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా పథకాలు అమలు చేస్తున్నాం. స్థిరాస్తి రంగంలో ఇప్పటికీ హైదరాబాద్ ప్రథమ స్థానంలో ఉంది. హైదరాబాద్ ప్రజలే గృహ రుణాలు అధికంగా తీసుకుంటున్నారు" అని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

# లక్ష తప్పుడు కేసులు పెట్టించినా ..ప్రజల పక్షాన ప్రశ్నిస్తూనే ఉంటా: హరీశ్ రావు

**అడుగడుగునా అన్యాయాలను నిలదీస్తున్నందుకు, నిజస్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నందుకు తనపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్రావు తెలిపారు.**



హైదరాబాద్, డిసెంబర్ 03 , (రిపబ్లిక్ న్యూస్): అడుగడుగునా అన్యాయాలను నిలదీస్తున్నందుకు, నిజస్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నందుకు తనపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో తనపై నమోదైన కేసుపై 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు.సీఎం రేవంత్రెడ్డి తనపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. సీఎంకు చేతనైంది ఒక్కటే. తప్పు చేసి దబాయించడం, తప్పుడు కేసులు బనాయించడం అని ఆక్షేపించారు. రుణమాఫీ విషయంలో దేవుళ్లను సైతం దగా చేశారని అన్నందుకు యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్లో తప్పుడు కేసు పెట్టించారని, ఇచ్చిన హామీలను ఎగవేస్తున్నారని అన్నందుకు బేగంబజార్ పోలీస్ స్టేషన్లో తప్పుడు కేసు పెట్టించారని హరీశ్రావు తెలిపారు. సోషల్ మీడియాలో ఎవరో పెట్టిన పోస్టుకు సైబర్ క్రైమ్ పీఎస్ లో తనపై కేసు పెట్టించారని, పార్టీ కార్యక్రమంలో మాట్లాడితే కోడిగుడ్డు మీద ఈకలు పీకి.. మానకొండూరులో అక్రమ కేసు పెట్టించారని పేర్కొన్నారు. సీఎం రెండు నాల్కల వైఖరిని బట్టబయలు చేసినందుకు, ప్రజాక్షేత్రంలో నిలదీసినందుకు తట్టుకోలేక ఇవాళ పంజాగుట్ట స్టేషన్ లో మరో తప్పుడు కేసు పెట్టించారని అన్నారు. లక్ష తప్పుడు కేసులు పెట్టించినా, ప్రజల పక్షాన ప్రశ్నించడాన్ని ఆపబోనని తెలిపారు.

# తాజ్మహల్ ను పేల్చివేస్తామంటూ బెదిరింపు మెయిల్



ఆగ్రా, డిసెంబర్ 03 , (రిపబ్లిక్ న్యూస్): ప్రపంచ ప్రఖ్యాత కట్టడం తాజ్మహల్ ను పేల్చివేస్తామంటూ వచ్చిన బెదిరింపు మెయిల్ అధికారులను పరుగులు పెట్టించింది. చివరికి బూటకమని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఉత్తరప్రదేశ్ టూరిజం ప్రాంతీయ కార్యాలయానికి మంగళవారం గుర్తు తెలియని ఖాతా నుంచి ఓ మెయిల్ వచ్చింది. తాజ్మహల్ ను పేల్చివేస్తామన్నది ఆ మెయిల్ సారాంశం. దీంతో అధికారులు ఉరుకులు పరుగులు పెట్టారు. బాంబు నిర్వీర్య బృందాలు, డాగ్స్క్వాడ్, ఇతర బృందాలు తాజ్మహల్ తోపాటు పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాయి.అయితే, అనుమానాస్పద వస్తువులేవీ కనిపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తాజ్మహల్ చుట్టూ భద్రతను మరింత పెంచినట్లు ఏసీపీ సయీద్ అరీబ్ అహ్మద్ మీడియాకు వెల్లడించారు. మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందన్న దానిపై దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మెయిల్ వచ్చిన వెంటనే ఆగ్రా పోలీసులకు, ఇతర ఉన్నతాధికారులకు సమాచారమందించామని ఉత్తరప్రదేశ్ డిప్యూటీ డైరెక్టర్ దీప్తి వాత్స తెలిపారు.

# వర్రా కేసు

## ..నలుగురు వైకాపా కార్యకర్తలను విచారించిన పోలీసులు

**వైకాపా సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీందర్రెడ్డి కేసులో ఆ పార్టీకి చెందిన నలుగురిని పులివెందుల పోలీసులు విచారించారు.**




కడప, డిసెంబర్ 03 , (రిపబ్లిక్ న్యూస్): వైకాపా సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీందర్రెడ్డి కేసులో ఆ పార్టీకి చెందిన నలుగురిని పులివెందుల పోలీసులు విచారించారు. కడప వైకాపా కోకన్వీనర్ సునీతారెడ్డితో పాటు గుంటూరు, విజయవాడ, నెల్లూరు చెందిన ఆ పార్టీ కార్యకర్తలను పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ విచారించి పలు అంశాలపై ఆరా తీశారు. సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టారనే ఆరోపణలతో పోలీసులు వీరిని విచారణకు పిలిచారు.

# హయత్నగర్లలో వ్యాపారవేత్త హత్య

**హయత్నగర్ పరిధిలోని భాగ్యలత కాలనీలో ఓ వ్యాపారవేత్త హత్యకు గురయ్యాడు.**



హైదరాబాద్ , డిసెంబర్ 03 , (రిపబ్లిక్ న్యూస్): హయత్నగర్ పరిధిలోని భాగ్యలత కాలనీలో వ్యాపారవేత్త హత్యకు గురయ్యాడు. కాశీరావు (37) అనే వ్యక్తిని అతడి కార్యాలయంలోనే గొంతుకోసి దుండగులు చంపేశారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్థిరాస్తి లావాదేవీలే హత్యకు కారణమా..? ఇతర కారణాలేమైనా ఉన్నాయా..? అనే కోణంలో పోలీసులు .

# మహిళా కానిస్టేబుల్ హత్య కేసు

## ..పోలీసుల అదుపులో నిందితుడు

**రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో జరిగిన మహిళా కానిస్టేబుల్ నాగమణి హత్య కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.**




ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 03 , (రిపబ్లిక్ న్యూస్): రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో జరిగిన మహిళా కానిస్టేబుల్ నాగమణి హత్య కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. నాగమణిని హతమార్చిన ఆమె తమ్ముడు పరమేశ్వ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై బీఎన్ఎస్ 103 (1) సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. పరువు హత్యతో పాటు ఆస్తి వివాదం కోణంలో విచారణ చేస్తున్నారు. పరమేశ్కు సహకరించిన నిందితుల కోసం మూడు బృందాలతో ఇబ్రహీంపట్నం పోలీసులు గాలిస్తున్నారు.

# అరుస్తావెందుకు అన్నాడని.. ఆయువు తీశాడు



నేరేడ్ మెట్ , డిసెంబర్ 03 , (రిపబ్లిక్ న్యూస్): పాన్ షాప్ వద్ద జరిగిన చిన్న ఘటన ఓ వ్యక్తి మృతికి కారణమైంది.దుకాణం యజమానిని పాన్ ఇవ్వమని అరచిన వ్యక్తిని.. ఎందుకు అంతలా గట్టిగా అరవడం అని పక్కనున్న వ్యక్తి అన్నాడు. దీంతో కోపోద్రిక్తుడైన నిందితుడు ఆ వ్యక్తి పై పిడిగుద్దులు వేయడంతో ముక్కు నుంచి రక్తస్రావం జరిగి అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందాడు. నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధి వినాయకనగర్ చౌరస్తా వద్ద సోమవారం రాత్రి 7 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదవనగర్ లో ఉంటున్న బండారి రాము(38) సెంట్రింగ్ పనిచేస్తుంటాడు. అతనికి భార్య అనిత, ఆరేళ్ల కుమారుడు ఉన్నాడు. రాము సోమవారం సాయంత్రం వినాయకనగర్ లోని ఓ వైన్స్ షాపు వద్దకు వచ్చి మద్యం తాగాడు. అనంతరం వైన్స్ బయట ఉన్న పాన్షాప్ వద్ద నిల్చున్నాడు. ఇంతలో శ్రీకాంత్ అక్కడికి వచ్చి పాన్ కావాలంటూ గట్టిగా అరిచాడు. ఎందుకలా అరుస్తున్నావని రాము అన్నాడు. దీంతో నువ్వెవ్వరా నాకు చెప్పడానికి అంటూ రాము ముఖంపై పిడిగుద్దులు వేయడంతో దుర్మరణం చెందాడు. వెంటనే నిందితుడు పరారయ్యాడు. పోలీసులు అతని కోసం గాలిస్తున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న మృతుడి భార్య అనిత, వారి బంధువులు బోరున విలపించారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



# మాజీ బాయ్ ఫ్రెండ్ దారుణహత్య.. బాలీవుడ్ నటి సోదరి అరెస్టు


**మాజీ బాయ్ ఫ్రెండ్ ను హత్య చేసిన కేసులో బాలీవుడ్ నటి సోదరిని న్యూయార్క్ పోలీసులు అరెస్టు చేశారు.**





బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీ సోదరి అలియా అమెరికాలో అరెస్టయ్యారు. జంట హత్య కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న ఆమెను న్యూయార్క్ పోలీసులు తాజాగా అరెస్టు చేశారు. గత నెల మాజీ బాయ్ ఫ్రెండ్, అతడి స్నేహితురాలిని అలియా సజీవదహనం చేసినట్లు ఆరోపణలున్నాయి.న్యూయార్క్ ఉంటున్న అలియా ఫక్రీ కొంతకాలం పాటు ఎడ్వర్డ్ జాకోబ్ అనే యువకుడితో డేటింగ్లో ఉంది. వీరి మధ్య మనస్పర్థలు రావడంతో ఏడాది క్రితం విడిపోయారు. నంతరం జాకోబ్కు అనాస్టాసియా ఎటినీ అనే యువతితో పరిచయమైంది. వీరిద్దరూ సన్నిహితంగా ఉంటున్నట్లు తెలుసుకున్న అలియా పలుమార్లు తన మాజీ బాయ్ ఫ్రెండ్పై బెదిరింపులకు పాల్పడింది.ఈ క్రమంలోనే నవంబరు 2న జాకోబ్, ఆయన స్నేహితురాలు ఉంటున్న భవనం వద్దకు వెళ్లి ఆ ఇంటికి నిప్పంటించింది. దీన్ని గమనించిన స్థానికులు వారిని అప్రమత్తం చేశారు. అయితే అప్పటికే మంటల్లో చిక్కుకుని వారిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలం మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు తాజాగా అలియా ఫక్రీని అరెస్టు చేశారు. ఈ కేసులో ఆమె దోషిగా తేలితే జీవితఖైదు పడే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఆమెను రిమాండ్కు తరలించారు. తదుపరి విచారణను డిసెంబరు 9వ తేదీకి వాయిదా వేశారు.సోదరి అరెస్టుపై నర్గీస్ ఫక్రీ ఇంకా స్పందించలేదు. రణ్ బీర్ కపూర్ నటించిన రాక్స్టార్తో ఫేమస్ అయిన నర్గీస్.. కిక్, హౌస్ఫుల్ 3 వంటి చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించారు. త్వరలో హౌస్ఫుల్ 5 సినిమాతో అలరించేందుకు సిద్ధమవుతోంది.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1992: అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం.
- 1884: మొదటి రాష్ట్రపతి బాబు రాజేంద్ర ప్రసాద్ జననం (మ.1963).
- 1889: భారత స్వాతంత్ర్యోద్యమకారుడు ఖుదీరామ్ బోస్ జననం (మ.1908). (చిత్రంలో)
- 1971: భారత్-పాకిస్తాన్ 3వ యుద్ధం ప్రారంభం.
- 1979: ప్రసిద్ధ హాకీ ఆటగాడు ధ్యాన్ చంద్ మరణం (జ.1905).
- 1984: భోపాల్ విషవాయు దుర్ఘటనలో 2200 మంది చనిపోయారు.
- 2011: ప్రముఖ హిందీ చలనచిత్ర నటుడు దేవానంద్ మరణం (జ.1923).


వికలాంగుల దినోత్సవం.


రాజేంద్ర ప్రసాద్


ఖుదీరామ్ బోస్


భారత్-పాకిస్తాన్


ధ్యాన్ చంద్


వి.పి.సింగ్

## రిపబ్లిక్ సినిమా

### 'పుష్ప3' కూడా ఉంది.. టైటిల్ ఏంటో తెలుసా?

**ప్రస్తుతం 'పుష్ప2' మాస్ హిస్టీరియా నడుస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో 'పుష్ప3'కి సంబంధించిన ఆసక్తికర విషయం ట్రెండ్ అవుతోంది.**




అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన 'పుష్ప2: ది రూల్' డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాకు కొనసాగింపుగా 'పుష్ప3'ఉంటుందని ఎప్పటి నుంచో టాక్ వినిపిస్తోంది. అది నిజం చేస్తూ, తాజాగా ఓ ఫొటో బయటకు వచ్చింది. ఈ సినిమాకు సౌండ్ ఇంజినీర్ గా ఆస్కార్ అవార్డు విజేత రసూల్ పూకుట్టి పనిచేశారు. ఆయన తన టీమ్తో కలిసి దిగిన ఫొటో వెనుక 'పుష్ప3' టైటిల్ ఉంది. అందులో 'పుష్ప3: ది ర్యాంపేజ్'అని ఉండటంతో పార్ట్-2 చివరిలో మూడో భాగానికి సంబంధించిన హింట్స్ ఇవ్వబోతున్నారని తెలుస్తోంది.

### 18 ఏళ్ల తర్వాత రమణ గోగుల సాంగ్ ..'గోదారి గట్టుమీద రామచిలకవే..' రిలీజ్

**'సంక్రాంతికి వస్తున్నాం' నుంచి తొలి పాట విడుదలైంది.**



'సంక్రాంతికి వస్తున్నాం'తో ఈ సంక్రాంతికి వినోదాలు పంచనున్నారు కథానాయకుడు వెంకటేశ్. ఆయన.. ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి నాయకానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రం నుంచి 'గోదారి గట్టుమీద రామచిలకవే..' అంటూ సాగే పాటను విడుదల చేశారు. 18 ఏళ్ల తర్వాత రమణగోగుల దీన్ని ఆలపించారు. దీనికి భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చగా.. భాస్కరభట్ల సాహిత్యమందించారు.

### బుక్ మై షోలో 'పుష్ప2' రికార్డు .. ఎన్ని టికెట్స్ అమ్ముడయ్యాయంటే!

**సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా నటించిన చిత్రం 'పుష్ప2'. ఈ సినిమా ప్రీ సేల్ బుకింగ్స్లో సత్తా చాటుతోంది.**



మరికొన్ని గంటల్లో పుష్పరాజ్ థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నాడు. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన 'పుష్ప: ది రూల్' సందడి మొదలైంది. డిసెంబర్ 4 అర్ధరాత్రి నుంచి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.తాజాగా బుక్ మై షోలో టికెట్ బుకింగ్స్ ఓపెన్ చేయగా హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. దీంతో మరో రికార్డు పుష్పరాజ్ సొంతమైంది. బాక్సాఫీస్ వద్ద అత్యంత వేగంగా వన్ మిలియన్ టికెట్స్ అమ్ముడైన చిత్రంగా 'పుష్ప2' నిలిచింది. కేవలం బుక్ మై షో లోనే వన్ మిలియన్ టికెట్స్ అమ్ముడవడం విశేషం. ఓవర్సీస్లోనూ ఈ చిత్రం ప్రీ సేల్ బుకింగ్స్లో హవా చూపుతున్న విషయం తెలిసిందే. ఇటీవల హిందీ వెర్షన్ టికెట్స్ ఓపెన్ చేయగా 24 గంటల్లో లక్ష టికెట్స్ సేల్ అయ్యాయి. బాలీవుడ్లో ఆల్టైమ్ టాప్ చిత్రాల లిస్ట్లో ఈ చిత్రం మూడో స్థానంలో నిలిచింది. రిలీజ్కు ముందే ఇన్ని రికార్డులు సృష్టిస్తున్న ఈ సినిమా విడుదల తర్వాత మరిన్ని సొంతం చేసుకోవడం ఖాయం అంటూ కామెంట్స్ చేస్తున్నారు ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా 12 వేలకుపైగా థియేటర్లలో, 80 దేశాల్లో, 6 భాషల్లో విడుదల కానుంది .

## రిపబ్లిక్ స్పోర్ట్స్

### ఇష్టం లేకపోతే భారత్‌కు రావొద్దు.. పాకిస్థాన్కు హర్భజన్ స్ట్రాంగ్ కౌంటర్

**ఛాంపియన్స్ ట్రోఫీని హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించడానికి ఓ మెలిక పెట్టిన పాక్ క్రికెట్ బోర్డుకు భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ గట్టి కౌంటర్ ఇచ్చాడు.**



వచ్చే ఏడాది పాకిస్థాన్ వేదికగా నిర్వహించే ఛాంపియన్స్ ట్రోఫీపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. ఆ దేశంలో పర్యటించేది లేదని, హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించాలని ఐసీసీని బీసీసీఐ కోరింది. మొన్నటివరకు ఛాంపియన్స్ ట్రోఫీని హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించడానికి ససేమిరా అంటూ వచ్చిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఎట్టకేలకు దిగి వచ్చింది. భారత్ మ్యాచ్లను తటస్థ వేదికలో నిర్వహించేలా హైబ్రిడ్ పద్ధతికి అంగీకరిస్తామని పేర్కొంది. కానీ ఈ విషయంలో పీసీబీ ఓ మెలిక పెట్టింది. భవిష్యత్తులో తమ జట్టు కూడా ఐసీసీ టోర్నీల కోసం భారత్కు వెళ్లబోమని.. ఆ మ్యాచ్లన్ను తటస్థ వేదికల్లో నిర్వహించేలా తమకు హామీ ఇవ్వాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ పాక్కు గట్టి కౌంటర్ ఇచ్చాడు. ఇష్టం లేకపోతే భారత్కు రావొద్దని, ఇందులో తమకెలాంటి బాధ లేదని పేర్కొన్నాడు.'మీకు ఇష్టం లేకపోతే భారత్కు రావొద్దు. ఈ విషయంలో మాకు ఎలాంటి బాధ లేదు. పాకిస్థాన్ జట్టు భారత్కు రాకపోతే ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. మీరు ప్రస్తుత క్రికెటర్లను అడిగినా ఇదే విషయం చెప్తారు. పాక్ లో పరిస్థితి భిన్నంగా ఉంటే ఈ విషయంలో భారత్ వైఖరి వేరేవిధంగా ఉండేది. మొండి వైఖరిని వదిలేసి టోర్నమెంట్ను జరగనివ్వండి. మీరు దానిని ఆపలేరు. మలేసియా, శ్రీలంకతోపాటు ఇతర దేశాలు ఆతిథ్యం ఇవ్వడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. పాకిస్థాన్లో పరిస్థితులు చక్కబడేవరకు భారత జట్టు అక్కడ పర్యటించదు' అని హర్భజన్ పాక్కు గట్టి కౌంటర్ ఇచ్చాడు.అదేవిధంగా గతంలో తాను క్రికెట్ మ్యాచ్ల కోసం పాకిస్థాన్లో పర్యటించిన సందర్భాలను భజ్జీ గుర్తు చేసుకున్నాడు. 'నేను అక్కడికి వెళ్లినప్పుడు వారు అద్భుతమైన ఆతిథ్యం ఇచ్చారు. మేము బయటికి వెళ్లి భోజనం చేసిన ప్రతిసారి వారు డబ్బులు తీసుకోలేదు. కొందరు మాకు శాలువాలు కూడా బహుమతిగా ఇచ్చారు' అని హర్భజన్ పేర్కొన్నాడు. విరాట్ కోహ్లితోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్టార్ ఆటగాళ్ల ఆటను పాక్ అభిమానులు ప్రత్యక్షంగా చూడలేకపోతున్నందుకు తనకు చాలా బాధగా ఉందన్నాడు. అయితే, ఇందులో పాక్ అభిమానుల తప్పేమీ లేదన్నాడు. అక్కడ పరిస్థితి మెరుగుపడేవరకు ఇలానే ఉంటుందని భజ్జీ వివరించాడు.

## పాలలో ఇదొక్కటి కలిపి తాగిస్తే చాలు .. చలికాలంలో పిల్లల్లో దగ్గు మాయం




చలికాలం ప్రారంభమైంది. చలి వాతావరణానికి జలుబు, దగ్గు వంటి సమస్యలు ఎక్కువగా స్తాయి. అయితే, చలికాలంలో పిల్లలు త్వరగా అనారోగ్యానికి గురయ్యే వాతావరణం ఉంటుంది. అంతేకాకుండా పిల్లలకు ఏదైనా తినిపించడం చాలా కష్టమైన పని. దీంతో.. సరిగ్గా తినక శక్తి అందక రోగాల బారిన పడతాయి. పిల్లలకు దగ్గు వచ్చిందంటే వదిలించడం చాలా కష్టం. చలికాలంలో పిల్లల్లో జలుబు, దగ్గు లక్షణాలు సాధారణంగా కనిపిస్తుంటాయి.పిల్లల్లో దగ్గు వచ్చిందంటే చాలా రోజుల పాటు ఉంటుంది.దీంతో.. పిల్లల్లో దగ్గు తగ్గించడానికి ఏ మందు ఇవ్వాలో అర్థం కాదు. అది కాకుండా పిల్లల్లో డాక్టర్లు ఇచ్చిన సిరప్‌లు, మందుల వేసుకోవడానికి మొండి పట్టు పడతారు. వారికి మందులు వేయించాలంటే తల్లిదండ్రులకు పెద్ద సవాల్. అయితే, మందులు, సిరప్‌లు తాగని పిల్లల కోసం కొన్ని ఇంటి చిట్కాలు ఉన్నాయి. వీటితో వారి దగ్గును నయం చేయవచ్చు. అందులో ఒకటి జాజికాయ. దీంతో.. పిల్లల్లో దగ్గును ఎలా తగ్గించుకోవచ్చో ఇక్కడ తెలుసుకుందాం.

### పిల్లల జీర్ణక్రియ..



జాజికాయలో జీర్ణ ఎంజైమ్‌లు ఉన్నాయి. ఇది పిల్లల జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది. ఈ రోజుల్లో చాలా మంది పిల్లలు కడుపు నొప్పి, గ్యాస్ సమస్యలతో బాధపడతారు. అలాంటి పిల్లలకు చిటికెడు జాజికాయ పొడిని తేనెలో కలిపి తాగించాలి. దీంతో.. పిల్లలకు కడుపునొప్పి, గ్యాస్ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.

### పిల్లలకు జాజికాయ వల్ల ప్రయోజనాలు..



ఆహారపు రుచిని పెంచడమే కాకుండా జాజికాయ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఆయుర్వేదం, ఔషధాల తయారీల్లో జాజికాయ విస్తృతంగా వాడతారు. జాజికాయ పిల్లలకు కూడా ఎంతో మేలు చేస్తుంది. పిల్లలకు దగ్గు ఉన్నప్పుడు చిటికెడు జాజికాయ పొడిని తినిపిస్తే.. జలుబు, దగ్గు నుంచి ఉపశమనం లభిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

### రోగనిరోధక శక్తి పెరుగుతుంది..

శరీరంలో రోగ నిరోధక శక్తి తగ్గినప్పుడు అనేక వ్యాధులు, ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. చలికాలంలో పిల్లలకు వ్యాధుల ముప్పు ఎక్కువ. చలి వాతావరణం కారణంగా పిల్లల్లో ఇమ్యూనిటీ పవర్ తగ్గిపోతుంది. దీంతో.. వారికి జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటి సమస్యలు వచ్చే ప్రమాదముంది. అందుకే పిల్లలకు పాలలో చిటికెడు జాజికాయ పొడిని కలిపి తాగిస్తే.. వారి రోగనిరోధక శక్తి పెరుగుతుంది.



### ఆవనూనెలో జాజికాయ పొడి..



చలికాలంలో పిల్లలకు జాజికాయ బెస్ట్ ఆప్షన్. ఈ సీజన్‌లో పిల్లలు జలుబు, దగ్గు సమస్యలతో బాధపడతారు. అలాంటప్పుడు కాస్త ఆవనూనెలో జాజికాయ పొడిని కలపండి. కొద్దిగా వేడి చేసి పిల్లల ఛాతీకి మసాజ్ చేయండి. దీంతో పిల్లలు జలుబు, దగ్గు నుంచి ఉపశమనం పొందుతాయి. ఈ రెండింటి మిశ్రమంలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చాలా మేలు చేస్తాయి.



### పిల్లలకు దంతాలు రాకపోతే..



కొందరి పిల్లలకు దంతాలు విరిగిపోతే.. అవి రావు. అంతేకాకుండా వారి దంతాలు ఊడినప్పుడు సమస్యలు ఎదుర్కొంటారు. అలాంటి పరిస్థితుల్లో జాజికాయను, పంచాదరను మెత్తగా చేసి పొడిలా మార్చండి. ఈ పొడిని పాలలో లేదా నీళ్లలో కలిపి పిల్లలకు ఇవ్వండి. దీని కారణంగా వారికి దంతాలు త్వరగా వస్తాయి.జాజికాయ నూనె దంతాల సమయంలో నొప్పిని తగ్గించడంలో సహాయపడుతుంది. జాజికాయ నూనెతో పిల్లల చర్మం మృదువుగా మారుతుంది.

గమనిక..ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. పిల్లల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.